## మేయర్ ఎంపికకై కార్పొరేటర్‌లతో సభ



మేయర్ అభ్యర్థి ఎంపిక కోసం కాంగ్రెస్ కార్పొరేటర్‌లతో చర్చిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త ;**
నగరపాలికె మేయర్ ఎన్నికలు ఈనెలల 29వ తేదీన జరగనుండగా పాలకపక్షమైన కాంగ్రెస్ కార్పొరేటర్ల సభ స్థానిక అల్లంభవన్‌లో ఆదివారంనాడు జరగగా కేపీసీసీ మాజీ అధ్యక్షుడు అల్లం వీరభద్రప్ప నేతృత్వంలో సభ జరిగింది. సభలో రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, మేయర్, ఉప మేయర్, పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.మహ్మద్‌రఫిక్, నాయకులు జె.ఎస్.ఆంజనేయులు, పాలికె సభ్యులు పాల్గొన్నారు. సభలో రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర మాట్లాడుతూ మేయర్ అభ్యర్థి ఎంపిక కోసం మీరే అభ్యర్థి పేరును సూచించాలని, వారినే మేయర్‌గా ఎంపిక చేద్దామని తెలుపుతూ, గతంలో మాదిరిగా తనపై అపార్థం చేసుకోరాదని, అందరి సమ్మతం మేరకు మేయర్ అభ్యర్థిని ఎంపిక చేద్దామని పేర్కొన్నారు. అల్లం వీరభద్రప్ప మాట్లాడుతూ ఇప్పటికే ఒక వ్యవధి పూర్తి అయ్యిందని, మిగిలిన సభ్యులకు నాలుగు విడతలుగా మేయర్, ఉప మేయర్, స్థాయిసమితి అధ్యక్షుల పదవులకు అవకాశం ఉంటుందన్నారు. మేయర్, ఉపమేయర్ స్థానాలు రిజర్వేషన్ ప్రకారం ఆయా కులాలకు చెందిన అభ్యర్థులు పోటీలో ఉంటారని, వారిలో ఒకరిని మేయర్‌గా, మరొకరిని ఉపమేయర్‌గా మీ అందరి సమక్షంలో ఎన్నుకునే అవకాశం ఇస్తున్నామన్నారు. సుదీర్ఘంగా చర్చించి ఎంపిక చేద్దామని చెప్పగా, సభలో పాల్గొన్న సభ్యులు అంగీకరించారు. మరోసారి భేటీ చేసిన అనంతరం అభ్యర్థిని ప్రకటిద్దామని అల్లం వీరభద్రప్ప సభకు తెలిపారు. ఇందులో ఎవరూ అపార్థాలు చేసుకోకూడదన్నారు.

## షిర్డీ సాయి సేవాసత్సంగ్ సేవా ట్రస్టుకు సి.ఎ.సైట్ మంజూరు



షిర్డీ సాయి సేవాసత్సంగ్ సేవా ట్రస్టుకు సి.ఎ.సైట్ మంజూరు పత్రాలు అందజేస్తున్న బుడా అధ్యక్షుడు మారుతిప్రసాద్

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త ;**
నగరంలో సామాజిక సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్థానిక షిర్డీ సాయి సేవాసత్సంగ్ సేవా ట్రస్టుకు బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికారం(బుడా) అధ్యక్షుడు మారుతిప్రసాద్ సి.ఎ.సైట్ స్థలాన్ని మంజూరు చేశారు. ఈ సందర్భంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థలం మంజూరుకు సంబంధించి అధీకృత పత్రాలను ట్రస్టు అధ్యక్షుడు గోపాలకృష్ణకి అందజేశారు. నగరంలోని బైపాస్ రోడ్డు అల్లంభవన్ సమీపంలో ఎస్ఆర్ఎం లేఅవుట్‌లో బుడా ఆధ్వర్యంలో సి.ఎ.సైట్ (పౌరుల సేవ కొరకు) మంజూరు చేస్తున్నట్లు షిర్డీ సాయిసేవా ట్రస్టు అందజేస్తున్న సామాజిక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలన్న ఉద్దేశ్యంతో ఈ స్థలాన్ని ట్రస్టుకు అందజేస్తున్నామని తెలిపారు. ట్రస్టుకు స్థలం కొనుగోలుకై దాతలు అందజేసిన విరాళాలతో ఈ స్థలాన్ని ట్రస్టుకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డా.డి.ఎల్.రమేష్ గోపాల్, అయ్యప్పస్వామి దేవస్థానం అధ్యక్షుడు జయప్రకాష్‌గుప్తా, ఆర్ఎస్‌బీ ట్రస్టు అధ్యక్షుడు పోలా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం అనర్హత వేటుపై.....

- బళ్లారిలో జిల్లా కాంగ్రెస్ ప్రతిఘటన



రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వంపై అనర్హత వేటుకు నిరసనగా ప్రతిఘటన జరుపుతున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్‌లు

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త ;**
ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, వైనాడ్ ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ స్థానాన్ని అనర్హం చేసిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చర్యకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ప్రతిఘటన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు జి.ఎస్.మహ్మద్ రఫిక్ నేతృత్వంలో స్థానిక సుధా సర్కిల్ ప్రాంతంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా బైఠాయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై అనవసర ఆరోపణలు మోపి న్యాయ వ్యవస్థను దుర్వినియోగం చేసిందని, రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ స్థానాన్ని అనర్హత చేయడంతో పాటు శిక్ష కూడా విధించే క్రూర చర్యకు పాల్పడిందని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నాయకులు ఆక్రోశం వ్యక్తం చేశారు. సుమారు 2 గంటల సేపు కాంగ్రెస్ నాయకులు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ, అమిత్‌షా నిరంకుశ పాలన పట్ల నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు సైతం ప్రతిఘటనలు, ధర్నాలు చేపట్టి నిరసన తెలుపుతున్నట్లు బళ్లారిలోనూ తాము ప్రతిఘటన జరుపుతున్నామని డీసీసీ అధ్యక్షుడు మహ్మద్‌రఫిక్ తెలిపారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లంప్రశాంత్, నారా భరత్‌రెడ్డి, ఆయాజ్‌అహ్మద్, వెంకటేష్‌హెగడే, షమీమ్‌జక్కలి, సూరి, మాజీ మేయర్ వెంకటరమణ, కార్పొరేటర్‌లు శ్రీనివాస్‌మించు, మాజీ కార్పొరేటర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు



అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, మార్చి 26 ప్రభాతవార్త**
పట్టణంలోని బాలాజీ నగర్ తేదేపా పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చన్నాయుడు జన్మదిన వేడుకలు రాష్ట్ర తేజ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేస్తూ పార్టీ విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్న అచ్చంన్నాయుడుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కన్వీనర్లు లక్ష్మినారాయణ, మనోహర్, కౌన్సిలర్ ఉమాశంకర్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈరణ్ణ ఆధ్వర్యంలో యువగళానికి భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఈరణ్ణ

**మడకశిర మార్చి 26 ప్రభాతవార్త;**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మరియు బహిరంగసభకు మాజీ ఎమ్మెల్యే ఈరణ్ణ ఆధ్వర్యంలో భారీగా తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి యువగళం పాదయాత్రకు భారీగా అత్యధిక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు ఎల్లోటి ఆదినారాయణ, అశ్వత్తామప్ప, పాండురంగప్ప,మాజీ ఎంపిటీసిలు గోపాలప్ప, వెంకటరమణప్ప, ప్రకాష్, కన్వీనర్ రామాంజినేయులు, రాజగోపాల్, కృష్ణప్ప, ఈశ్వర్‌సాగర్, రమేష్, ఈశ్వరప్ప, చిరంజీవి,అజయ్,నరిసింహమూర్తి,సన్నమారేగౌడు, రామన్న, గోపాల్‌రెడ్డి, మల్లేషప్ప, కరియన్న,నరేష్,అశ్వత్త,సన్నపప,శ్రీనివాసులు, మారుతి తదితర నాయకులు,కార్యకర్తలు,పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు,అభిమానులు పాల్గొన్నారు.

## విగ్రహదాత వైబి హాళ్ళి జనార్ధన్‌రెడ్డిచే యోగివేమన విగ్రహావిష్కరణ



యోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జనార్ధన్‌రెడ్డి

**మడకశిర మార్చి 26 ప్రభాతవార్త;**
పట్టణపరిధిలోని ఆదిరెడ్డి పాళ్యంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహ దాత వైబి.హాళ్ళి వైఎస్.జనార్ధన్ రెడ్డి విశ్వకవి ప్రజాకవి మహాయోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహిళలు కళశాలతో రెడ్డి కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున విగ్రహం వద్దకు చేరుకొన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించి బహిరంగ సభలో పాల్గొన్నారు. వైబి హాళ్ళి వైఎస్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగివేమన సుమారు 1652-1730 మధ్యకాలంలో జీవించాడని,వేమన కొండవీటిరెడ్డి రాజవంశానికి చెందినవారని సిపిబ్రౌన్ తెలిపాడని అన్నారు. సిపి బ్రౌన్ వేరే దేశస్థుడైన కూడా తెలుగు నేర్చుకొని వేమన పద్యాలను తెలుగు జాతికి తెలిపాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం దాదాపు నెల రోజులు నుండి చేపట్టారని ఇంత పెద్ద కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు నిర్వహించడం గర్వకారణమని అన్నారు.స్థానిక ఎంఎల్ఎ డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ రెడ్ల కళ్యాణ మంటపానికి ప్రభుత్వ భూమిని ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. రెడ్డి సంఘం వ్యవస్థాపకులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈబిసి నేస్తం లాంటి పథకాలు సాధించడం జరిగిందని, భవిష్యత్తులో ప్రభుత్వ సహకారం తీసుకొని రెడ్లకు మరిన్నీ హక్కులు సాధిస్తామని తెలిపారు. అనంతరం విగ్రహం ఏర్పాటుకు రూపాయలు 1లక్ష 40వేలు అందించిన విగ్రహదాత వైబి.హాళ్ళి వైఎస్ జనార్ధన్‌రెడ్డిని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులుదండు ధర్మారెడ్డి, గౌరవాధ్యక్షులు బయపురెడ్డి, తమ్మినేని గోపాల్‌రెడ్డి,బాబుల్‌రెడ్డి, రేనాటి నాగేశ్వరరావు, నరసింహారెడ్డి,రవిశేఖర్‌రెడ్డి, ఆనందరంగారెడ్డి, వైసి.గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగభూషణరెడ్డి, బాలురెడ్డి, నరేష్‌రెడ్డి, నితిన్‌రెడ్డి, మణికంఠరెడ్డి,శ్రీరామరెడ్డి, నాగభూషణరెడ్డి, వెంకటేష్‌రెడ్డి,నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరుస దాడులతో పేకాట దారుల్లో బెంబేలు

**అగళి, మార్చి 26 ప్రభాతవార్త**
అగళి ఎస్ఐ లావణ్య, సిబ్బంది జూదం ఆడుతున్న వారిపై వరుస దాడులు చేయడం మూలంగా పేకాట దారులు బెంబేలెత్తుతున్నారు. దాసేగౌనహల్లి గ్రామంలో జూదం ఆడుతున్న ఆరు మందిని అరెస్టు చేసి 5,100 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. గత నాలుగైదు రోజులుగా మధ్యాహ్నం, రాత్రి, తెల్లవారు జాము అనే తేడా లేకుండా ఎస్ఐ జూదం ఆడుతున్న వారిపై దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా ఉగాది సమయంలో తుమకూరు, బెంగుళూరు లాంటి ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లిన వారు పండుగ సమయాల్లో వచ్చి జూదం ఆడతారు. అందులో భాగంగానే ఈ దాడులు చేస్తున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. ఇప్పటికే మండలంలో అగళి, డిజి హళ్లి, వీరనపల్లి, ఆలూడి, నందరాజనపల్లి సమీపం ఇలా ఆరేడు చోట్ల దాడులు చేసి 40 నుంచి 50 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మండలంలో కూలీలు అధికం. కూలీ చేసిన డబ్బులు పెట్టి జూదం ఆడటానికి వెళ్లి డబ్బులు నాశనం చేసుకుంటారు. ఇలాంటి దాడులు చేస్తే జూదం అదుపులోకి వచ్చి కూలీలు సైతం తమ డబ్బులను మిగిల్చు కుంటారు. దాన్ని కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకుంటారు. వరుస దాడులు చేయడం మూలంగా దాదాపు 70 శాతం జూదం ఇప్పటికే అదుపులోకి వచ్చింది. ఒకటి అర ఎక్కడైనా జూదం ఆడుతున్నా వారిని కూడా ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

## తాటి ముంజెలకు భలే గిరాకీ..!

-పోషక విలువలు వుండటంతో ఎగబడుతున్న ప్రజలు
-కాయలను తెచ్చి అక్కడే ముంజెలను తీసి విక్రయిస్తున్న వైనం
-డజను తాటిముంజెలు ధర రూ.50 నుండి 60



అమ్మకానికి ఆటోలో తీసుకొచ్చిన తాటికాయలు



**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**
తాటి ముంజెలకు భలే గిరాకీ కనబడుతోంది. పామిడి మండలానికి చెందిన వ్యాపారులు వివిద వాహనాల్లో తాటికాయలను తీసుకొచ్చి పట్టణంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంతంలో కాయల నుండి అక్కడికక్కడే ముంజెలు తీసి విక్రయిస్తుండగా ప్రజలు వాటి కొనగోలుకు ఎగబడుతున్నారు. డజను ముంజెలను 50 నుండి 60 రూపాయలు ధర నిర్ణయించి అమ్మకాలు కొనసాగిస్తుండగా ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. తాటి ముంజెల్లో ఎన్నో పోషక విలువలు వుంటాయని వేసవిలో వీటిని తినడం ద్వారా ఎంతో ప్రయోజనం వుంటుందని వైద్యులు చెబుతున్నారు, తాటిముంజెలు ఆకలిని, దాహాన్ని ఒకేసారి తీరుస్తాయని పురాతన కాలం నుండి ఆరోగ్య ప్రదాయినిగా వుంటున్నాయని అంటున్నారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్ ఎ,సి,బి కాంప్లెక్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. చెమటవల్ల వచ్చే పొక్కులు, స్కిన్ అలర్జీల నివారణకు ఔషదంగా పనిచేస్తుంది. వీటిలో చక్కెర తక్కువస్థాయిలో వుంటుంది కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా తినవచ్చని చెబుతున్నారు. వీటిలోవుండే బి, సి ఐరన్, జింక్, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, దిజయామిన్, రెబోఫ్లోవిన్, హృద్రోగ సమస్యలను అరికడుతుందని, కిడ్నీలో రాళ్లు, అధికవేడి, పొడిచర్మం, డీ హైడ్రేషన్ వంటి సమస్యలను రానివ్వదంటున్నారు. వేసవిలో కోల్పోయే పోషకాలు, ఎలెక్రోలైట్స్‌ను తాటిముంజ భర్తీ చేస్తుందని ఇందులో తక్కువ కేలరీలు వుండటంవల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇది చక్కటి పరిష్కారం అంటున్నారు. తాటిముంజలలోని నీరు గర్భిణులకు వచ్చే కడుపునొప్పి, జీర్ణ సంబంధిత, మలబద్ధక సమస్యలను నివారిస్తుందని వికారం, వాంతులు రాకుండా చేసి కాలేయం, ప్లీహం వంటి వ్యాధులకు మందుగా పనిచేస్తుందని చెబుతున్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థల ప్రచారాన్ని అడ్డుకున్న విద్యార్థి సంఘాలు

-విద్యా సంవత్సరం ముగియకుండానే అడ్మిషన్లపై ఆగ్రహం



ప్రచారం కోసం వచ్చిన బస్సుల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**
పట్టణంలో ఆదివారం ఇతర ప్రాంతాలకు చెందిన కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తమ సిబ్బందితో చేపట్టిన ప్రచారాన్ని విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయి. గుంతకల్లుకు చెందిన పలు కార్పొరేట్ విద్యాసంస్థలు రెండు బస్సుల్లో దాదాపు 50 మంది సిబ్బందిని తీసుకొచ్చి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో కరపత్రాలు పంచుతూ విద్యార్థులను తమ విద్యాసంస్థల్లో చేర్చాలని ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు వారిని అడ్డుకొని అధికారులను నిలదీశారు. సదరు విద్యాసంస్థల సిబ్బంది వచ్చిన బస్సుల తాళాలు, కరపత్రాలులాక్కొని మండలవిద్యాశాఖాధికారికి సమాచారం అందించి బస్సులు కదలకుండా అడ్డుకున్నారు. దీంతో సంబంధిత విద్యాసంస్థల అధికారులు విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతూ తాము ప్రచారం, అడ్మిషన్ల కోసం రాలేదని సిబ్బందితో కలిసి దైవ దర్శనాలకు వచ్చామని మరోమారు ఇలా రామని చెప్పగా వాదోపవాదాలు కొనసాగాయి. విద్యాసంవత్సరం ముగియకుండానే వచ్చే విద్యాసంవత్సరానికి ప్రచారం, అడ్మిషన్లు చేయడం నిషిద్ధమని మరొకమారు వస్తే సహించేదిలేదని హెచ్చరించి వదిలేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సిద్దార్థ, చిరంజీవి, భరత్ తదితరులు ఉన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

-హాజరైన సీఐ వి.హరినాథ్, సర్పంచ్ మీనుగ లలిత, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ -మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న విగ్రహం



క్లాక్ టవర్ కూడళిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజలో పాల్గొన్న యుపీఎస్ సీఐ వి.హరినాథ్, సర్పంచ్ మీనుగ లలిత, జెడ్పీటీసీ ఏ.సి.ఎర్రిస్వామి, విగ్రహ దాత మోపిడి తిప్పయ్య

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక క్లాక్‌టవర్ కూడళిలో స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, దివంగత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు యం.రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి యుపీఎస్ సీఐ వి.హరినాథ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలిత, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మతోపాటు విగ్రహ దాత మండల పరిధిలోని మోపిడి గ్రామానికి చెందిన తిప్పయ్య ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, వారు చేసిన పోరాటం చిరస్మరణీయమని వారిని స్ఫూర్తిగా తీసుకొని మన జీవితాలను మలుచుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు యం.బసవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి, ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షులు యం.గంగాధర్, నాయకులు వెలిగొండ ఓబయ్య, రాంపురం చెన్నప్ప, కౌకుంట్ల సురేష్, యం.రామాంజినేయులు, ఆమిద్యాల మల్లప్ప, ఆమిద్యాల రామన్న, యం.మల్లికార్జున, రమేష్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

-ట్రస్టు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, భోజన వసతి

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**
దివంగత మాజీ ఎమ్మెల్యే వశికెరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 150 మంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరిగిందని ట్రస్టు వైస్ ఛైర్మెన్ వశికెరి మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఈనెల 8వ తేదీన పట్టణంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోగా వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారిని నంద్యాలలోని శాంతరాం ఆసుపత్రికి తరలించి అక్కడ ఆపరేషన్లు చేయించిన అనంతరం సురక్షితంగా వారి స్వగ్రామాలకు చేర్చడం జరిగిందన్నారు. ఈ క్రమంలో వారి కంటిచూపు, ఆరోగ్యంపై గూర్చి తెలుసుకోవాలన్న ఉద్దేశంతో స్థానిక వాణి విద్యా నికేతన్‌లో కంటి వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు చేయించి వారి ద్వారా పలు సూచనలు చేయించడం జరిగిందన్నారు. కాగా పరీక్షల కోసం వచ్చిన ఆపరేషన్లు చేయించుకున్న వారితోపాటు సహాయకులకు ట్రస్టు ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఆపరేషన్లు చేయించుకున్న పలువురు మాట్లాడుతూ ట్రస్టుకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై నారాలోకేష్‌కు వినతి



నారాలోకేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

**పుట్టపర్తిరూరల్, మార్చి 26, ప్రభాతవార్త**
యువగళం పాదయాత్రలో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గంకు విచ్చేసిన నారాలోకేష్‌కు నియోజకవర్గంలోని ఆటో కార్మికులతో కలసి వినతిపత్రం సమర్పించినట్లు ఆటో యూనియన్ నాయకులు తెలియజేశారు. ఆటో కార్మికులు పడుతున్న కష్టాలు, సాదకబాధకాలను ఆయనకు తెలియజేశామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఆటో కార్మికుల కొకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకుంటామని, ఇన్సూరెన్స్, పెట్రోల్, డీజల్ సమస్యలు, ఆటో కొనలేని కార్మికులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇవ్వడం జరిగిందన్నారు. లోకేష్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో ఆటోయూనియన్ నాయకులు గాజుల రామాంజినేయులు, షామీర్, శేషు, యాసిన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## రూ.1.77 కోట్లతో రోడ్డు, యూజీడీ పనులకు శ్రీకారం



రోడ్డు, యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త ;**
నగరంలోని సంగనకల్ రోడ్డులోని 21వ వార్డు తిరుమలనగర్ నుంచి మెయిన్ రోడ్డుకు లింకు కల్పించే రోడ్డు, డ్రయినేజీ నిర్మాణ పనులకు ఆదివారంనాడు స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.1.77 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపిన ఎమ్మెల్యే, వార్డులో ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తి అయినట్లు, మరికొన్ని మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలోనే వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంలో స్థానిక కార్పొరేటర్ సురేఖమల్లన్నగౌడ, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి అభివృద్ధిపై చర్చకు రండి

-లోకేష్, పల్లెకు ఎమ్మెల్యే దుద్దుకుంట సవాల్



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

**పుట్టపర్తి, మార్చి 26, ప్రభాతవార్త :**
పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, మీరు సిద్ధమేనా? అని నారాలోకేష్, పల్లె రఘునాథ్ రెడ్డిలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సవాల్ విసిరారు. తెలుగుభాషపై స్పష్టత లేని నారాలోకేష్ నారాపులికేశిగా ఎద్దేవా చేశారు. పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి టికెట్ తనకు దక్కదన్న అభద్రతతో పల్లె రఘునాథ్ రెడ్డి పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావన్నారు. నియోజకవర్గంపై ఎటువంటి అవగాహన లేని నారా లోకేష్‌కు ఒక అబద్ధపు స్క్రిప్ట్‌ను రాసిచ్చి చదివించిన ఘనుడు పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంకు రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఐటి మంత్రిగా వివిధ హోదాలలో పని చేసిన రఘునాథ్ రెడ్డి ఒక్కపరిశ్రమను కూడా తీసుకురాలేని అసమర్థుడన్నారు. తిరిగి అవకాశం ఇస్తే అన్ని సాధిస్తానని ప్రగల్భాలు పలుకుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ ఎన్నికల్లోనూ గెలుపు సాధించలేని వ్యక్తి లోకేష్ అన్నారు. జగన్మోహన్ రెడ్డి నీలాగా అసమర్థుడు కాదన్నారు. 2019 ఎన్నికలకు ముందు పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు ఉన్నాయని గుర్తించిన వ్యక్తిని తానేనని, వాటికి హంద్రీనివా సుజల స్రవంతి ద్వారా నీటిని నింపేందుకు 860 కోట్ల రూపాయల మంజూరు కోసం సిఎంను ఒప్పించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. ఇసుక ట్రిప్పర్లను కర్ణాటకకు, అక్కడి నుండి అక్రమ మద్యంను ఆంధ్రాకు తీసుకువచ్చే దుర్మార్గపు రాజకీయాలను తాను చేయనన్నారు. సత్యమ్మ దేవాలయం వద్ద తాను ప్రమాణం చేసి ఆ దుర్మార్గపు పనులకు పాల్పడలేదని నిరూపించుకుంటాను, మీరు చిత్రావతి నది నుండి ఇసుకను తరలించలేదని ప్రమాణం చేయగలరా? అని సవాల్ విసిరారు. 31న సత్యమ్మ దేవాలయం వద్ద ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అదే రోజు సాయంత్రం 06:00 గంటల నుండి 08:00 గంటల వరకు టిడిపి కార్యాలయం వద్ద చర్చకు ఆధారాలతో కూడిన పేపర్లతో సిద్ధంగా ఉంటానని, శ్రీధర్ రెడ్డి సవాల్ విసిరారు. విమర్శలు నిరూపించకపోతే మీరు రాజకీయ సన్యాసం తీసుకోవాలని, తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, చేసిన ప్రకటనలు నిరూపించకపోతే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

## వడ్డెర్లను చట్టసభల్లోకి పంపించే బాధ్యత తెలుగుదేశం పార్టీదే -నారాలోకేష్

**పుట్టపర్తిరూరల్, మార్చి 26, ప్రభాతవార్త ప్రతినిధి:**
వడ్డెర్ల చట్టసభల్లోకి పంపించే బాధ్యత తెలుగుదేశం పార్టీదే అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా బిసి కులాలకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గంకు చెందిన వడ్డెర్ల సంఘం నాయకులు వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలు, రావాల్సిన హక్కులపై లోకేష్ బాబు దృష్టికి తీసుకురాగా, చట్టసభల్లోకి వడ్డెర్లను తెచ్చే బాధ్యత టిడిపిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో వడ్డెర కులానికి చెందిన వారికి ఖచ్చితంగా చట్టసభల్లోకి పంపడానికి తెలుగుదేశం పార్టీ అవకాశం కల్పిస్తుందన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే వడ్డెర్లను ఎస్టి జాబితాలోకి చేర్చడానికి చొరవ తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, జిల్లా కన్వీనర్ పల్లపురవీంద్ర, మరియు వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలుగా యువతను తీర్చిదిద్దుతాం

## - ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తాం - ఏపిని గంజాయి కేంద్రంగా మార్చిన జగన్ - టిడిపి అధికారంలోకి వస్తే క్రీడలకు అధిక ప్రాధాన్యత - ముఖాముఖిలో నారా లోకేష్


సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్


ముఖాముఖిలో పాల్గొన్న యువతీ, యువకులు


ముఖాముఖి లో మాట్లాడుతున్న ఓ యువతి

ఓబుళదేవరచెరువు, మార్చి 26, ప్రభాతవార్త : గ్రామీణ, పట్టణ ప్రాం తాల్లో మంచి చదువులు చదువు కున్న యువతీ, యువకులను ఉద్యో గులు గానే కాకుండా పారిశ్రామి కవేత్తలుగా తీర్చిదిద్దుతామని టిడిపి జాతీయ ప్రధా న కార్యదర్శి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. హలో లోకేష్ కార్యక్రమంలో భాగంగా ఓడీచెరువు మండలం పగడాలవారి పల్లిలో ఆదివారం యువతతో ముఖాముఖి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన నిరుద్యోగ యు వతీ, యువకులు గాయత్రి, శ్వేతారెడ్డి, రవి, రాజేష్, భారతి, జయసింహా తదితరులు పలు రంగాలకు ఏవిధమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తా రని ముఖాముఖిలో నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందు కు లోకేష్ వారికి సమాధానం ఇస్తూ పక్కరాష్ట్రాల గురించి దినపత్రికల్లో పెట్టుబడులు, యువపారి శ్రామిక వేత్తల మార్గదర్శ కాలు స్పష్టంగా కనపడుతు న్నాయన్నారు. అయితే ఏపిలో పేపర్ తెరుస్తూనే కేసులు కబ్జాలు, ఆక్రమణ లు, దందాలు మాత్రమే కనిపిస్తు న్నాయని ఇది భాదాకరమైన విషయం అన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయా ంలో ఏపికి వచ్చిన పరిశ్రమలు, పలు కంపెనీలు వాటి అనుబంధ సంస్థలను ముఖ్య మంత్రి ఇతర రాష్ట్రాలకు తరిమివేశాడన్నారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తేవారిని జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వారిని అనిచివే స్తోందన్నారు. మరీ ముఖ్యంగా యువత సోషల్ మీడి యాలో స్పందించినా వారిపై సిఐడి పోలీసులతో కేసులు పెట్టి వేదిస్తోం దన్నారు. యువతకు జరుగుతున్న అనా య్యంపై పోరాడేందుకే వారిని చైతన్యపరచి దిశా నిర్ధేశం చేయడానికే యువగళం ప్రారంభించడం జరిగిం దన్నారు. తాము అధికారం లోకి వస్తూనే ప్రభుత్వ, ప్రైవేటు స్వయం ఉపాధి రంగంలో విరివిగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. యువ తను ఉద్యోగులుగానే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ప్రోత్స హించి పురోగ మణదిశగా వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతపు రం జిల్లాలో కియా కార్ల పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి చంద్ర బాబు తీసుకువచ్చి వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించా మన్నారు. కడపకు ఉక్కు, ఎలక్ట్రానిక్ కంపెనీలు కర్నూలుకు సిమెంటు, సోలార్ కంపెనీలు పెట్టి ప్రోత్స హించడం జరిగిందన్నారు. వీటిని జగన్ ప్రభుత్వం మూసివేయడం జరిగిందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక వాటిని పునరు ద్ధరిస్తామన్నారు. చంద్రబాబు పాలనలో పీజి విద్యా ర్థులకు ప్రత్యే క జీవో ద్వారా ఫీజురియంబర్స్ మెంట్ అందించడం జరిగిందని అయితే జగన్ అధికా రంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేశారన్నారు. ఆ పథకాన్ని కొనసాగిం చాలనే అంశంపై మేధావులతో చర్చిస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వ హయాం లో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరకుపోయిందని ఆ అప్పులు ఎప్పుడు తీరుతాయో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నా యన్నా రు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అసెంబ్లీ సాక్షిగా నిండు సభలో నా తల్లిని అవమానిం చారన్నారు. రాష్ట్రంలోని మహిళలను కించప రిచేలా మహిళా మ ంత్రి రోజా అనుచిత వ్యాఖ్యలు చేసి మహిళల మనోభా వాలను దెబ్బతీసిందన్నారు. ప్రస్తుతం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో చదువ ుతున్న విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడలకు శిక్షణ ఇచ్చేవారే కరు వయ్యారని అంతే కాకుండా కబడ్డీ, వాలీబాల్, షటిల్ వంటి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులకు సరైన ప్రోత్సా హం లేక ఉసూరు మంటు న్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి క్రీడా కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో గంజాయిలాం టి మాదకద్రవ్యాలను విచ్చల విడిగా విక్రయిస్తూ వైసిపి నాయకులు కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. తమ లాభాల కోసం యువ తను గంజాయికి అలవాటు చేసి తమ పబ్బం గడుప ుకుంటు న్నారన్నారు. గంజాయికి వ్యతిరేకంగా యువత పెద్దఎత్తున పోరాడా లని వాటిని ఏపి నుండి తరిమికొట్టాలని లోకేష్ పిలుపు నిచ్చారు. బెంగ ళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలవైపు మనం చూడడం కాదు ఆ నగరాలు మన ఏపివైపు చూసేలా అభివృద్ధి మార్గాన్ని చూపిస్తామని లోకేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ పంచమర్తి అనూరాధ, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

పెద్దవడుగూరు, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా ఆయన మండల వ్యాప్తంగా దెబ్బతిన్న కొర్ర, తదితర పంటలను అధికారులతో కలిసి క్షేత్రస్థా యికి వెళ్లి పరిశీలించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు తప్పకుండా పంట నష్టపరిహారం అందచేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికారప్రతినిధి పాశం రంగ స్వామి, వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, చిన్నవడుగూరు మధురెడ్డి, శేషారెడ్డి, నందకుమార్‌రెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ శ్రీకాంంత్‌రెడ్డి నాయ కులు, కార్యకర్తలకు సూచిం చారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జనసేన పార్టీ విధివిధానాల గురించి తెలియచేశారు. అంతేకాకుండా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి జనసేన పార్టీ నాయ కుడు, కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులను ఎస్‌సిలోకి చేర్చాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

పుట్లూరు, మార్చి 26 ప్రభాతవార్త

దళిత క్రైస్తవులను ఎస్‌సిలోకి చేర్చాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభు త్వం ఉపసంహరించుకోవాలని మం డల బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడు తూ దళిత క్రైస్తవులను ఎస్‌సిలోకి చేరుస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్యని వారు ఖండించారు. ఈ ప్రభుత్వ చర్యలు మతమార్పిడులను ప్రోత్స హించేలా వున్నాయన్నారు. ఈ తీర్మానం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వైసిపి ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల నిజమైన ఎస్‌సిలకు అన్యా యం జరుగుతుందన్నారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి పుట్లూరు మండల అధ్యక్షులు కుందు శ్రీనివాసులురెడ్డి, ~~ఓబిసి మోర్చా~~ మండల అధ్యక్షులు రాగేని రామాంజి యాదవ్, మండల ఇన్‌చార్జ్ వెంకటయ్య, ప్రధాన కార్య దర్శి కుపేంద్రరెడ్డి, ఎస్‌సి మోర్చా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాలకు హాజరైన జె.సి అశ్మిత్‌రెడ్డి


బహుమతి అందచేస్తున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలోని యాడికి, తూట్రాళ్లపల్లి గ్రామాల్లో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాలకు తెలుగుదేశంపార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలోని జంగాల శ్రీరామ్, లక్ష్మణ్ కుమా రుల కేశఖండన కార్యక్రమానికి హాజరై వారికి బహుమతులు అందచేశారు. అదేవిధంగా తూట్రాళ్లపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తాంద్ర విక్రమ్, మధురాజు, కులశేఖర్, నీలకంఠారెడ్డి, శివ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## రాయలచెరువులో పౌష్టికాహార పక్షోత్సవాలు


కార్యకర్తలకు సూచనలు ఇస్తున్న సిడిపిఒ సాజిదాబేదం

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని పలు అంగన్‌వాడి కేంద్రాల్లో ఆదివారం పౌష్టికాహార వారోత్స వాలను నిర్వహించినట్లు సిడిపిఒ సాజిదా బేగం తెలిపారు. ప్రతి నెలా అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహించే సెక్టార్ సమావేశాల్లో భాగంగా సిడిపిఒతో పాటు సూపర్‌వైజర్ శంషాద్‌బేగం, అంగ న్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రస్తుతం వేసవిలో రాగిజావ గురించి, పౌష్టికాహారంతో పాటు పోషక విలువలు, విటమిన్లు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పలు సూచ నలు, సలహాలు అందించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భవతులు, బాలిం తలకు పోషక విలువలతో కూడిన ఆహారం ప్రభుత్వం సరఫరా చేసే వాటిని తప్పకుండా పంపిణీ చేయాలని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని పలు సూచనలు అందించారు.

## వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలోకంటి ఆపరేషన్లు


వృద్దులతో మాట్లాడుతున్న వజ్ర

కదిరి, మార్చి 26 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, వజ్ర ఫౌండేషన్ అధినేత వజ్రభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్దులకు కంటి ఆపరే షన్లు నిర్వహించారు. ఆదివారం కదిరి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి శస్త్ర చికిత్స కార్యక్రమంలో వజ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా చివరి ఆదివారం వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని ఈ రోజు దాదాపు 415 మంది కంటి ఆపరేషన్ చికిత్సకు ఎంపిక కావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, వజ్ర ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మచ్చాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పణ


శ్రీమచ్చాలమ్మ అమ్మ వారి మూల విరాట్


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

నల్లచెరువు, మార్చి 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని దేవరింటి గ్రామ సమీపంలో ఉన్న మచ్చాలమ్మ దేవస్థానంలో ఆదివారం దేవరింటిపల్లి గ్రామ ప్రజలు మచ్చాలమ్మ అమ్మ వా రికి బోనాలు సమర్పించారు. గ్రామప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. దేవరింటి పల్లి గ్రామ ప్రజలు బోనాల కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వ హించా రు. ప్రత్యేక అలంకరణలో ఉన్న మచ్చాలమ్మ అమ్మవారిని గ్రామ ప్రజలతో పాటుచుట్టు ప్రక్కల గ్రామ ప్రజలుకూడా దర్శించుకున్నారు. ఈ సందర్బంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో కొలువై ఉన్న మచ్చాలమ్మ అమ్మవారు మహాశక్తి గల అమ్మవారని, కోరినకోర్కెలు తీర్చే అమ్మ వారని అలా ంటి మచ్చాలమ్మ స్వామి తమ గ్రామంలో కొలువై ఉండటం సంతో షమ న్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తాలూకా, జిల్లా నలు మూలల నుండి భక్తులు వస్తారని తెలిపా రు. తాము కోరిన కోర్కెలు తీర్చిన అమ్మవారికి బోనాలు సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మాజీ సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, టీచర్ రామాం జినే యులు, నరేంద్ర, కరివేపాకు శంకర, కడపల జయచంద్రారెడ్డి, నర్సిరెడ్డి, నాగముని, ఎంపిటిసి రాచంద్రారెడ్డి, ఆదినారాయణ, సతీష్ రెడ్డి, కడపల భాస్కర్‌రెడ్డి, బుర్రారాజా రెడ్డి, వెంకట మల్లు, నర్సరీ రమణ, చిన్నప్పల్లా, రమ ణ తదితరులు పాల్గొని అమ్మ వారికి బోనాలు సమర్పించారు.

## ఘనంగా అచ్చం నాయుడు జన్మధిన వేడుకలు


అచ్చంనాయుడు పుట్టిరోజు వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

గాండ్లపెంట, మార్చి 26, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ రాష్ట్రఅధ్యక్షులు అచ్చం నాయుడు జన్మధిన వేడు కలను ఆదివారం మండల టిడిపి నా యకులు ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్బంగా మండల కేంద్రం లోని టిడిపి పార్టీ కార్యాలయంలో టిడిపి మండల కన్వీనర్ కొండయ్య ఆద్వర్యంలో కేక్ కట్ చేసి అచ్చం నా యుడు పుట్టిరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కేక్ క ట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్బంగా ఆ పార్టీ మండల క న్వీనర్ మాట్లాడుతూ టిడిపి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న అచ్చం నాయుడు మరిన్ని పుట్టిరోజు వేడుకలు జరుపుకోవాలని ఆయన ఆకా ంక్షించారు. ఈ కార్యక్ర మంలో తెలుగు యువత నాయకులు రమేష్, అక్ర మ్ బాషా, దాదా పీర్, అంజినాయక్, ఆంజినేయులు, పవన్‌కుమార్, నాగ రాజు, గంగిశెట్టి, అంజి, షమీవుల్లా, రవి, బాబాసాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాలనీకి వెలుగులు

నల్లచెరువు, మార్చి 26, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీకి గత 15 సంవత్సరాల నుండి విధ్యుత్ సౌకర్యం లేక కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చినమాట ప్రకారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి ఆదేశానుసారం విద్యుత్ అధికారులతో సర్పంచ్ పంఛరత్నమ్మ దృష్టికి తీసుకుపోయి విధ్యుత్ అధికారులు ఏఈ వాగ్దేవి, లైన్‌మెన్‌లు నరసిం హులు, జనార్ధన, కృష్ణల సహకారంతో ఆదివారం విద్యుత్ సరఫరా మరమ్మ త్తులు చేయించి కాలనీవాసులకు విద్యుత్ సమస్యలు రాకుండా విధ్యుత్ సరఫరా అందించారు. కాలనీవాసులు ఎమ్మెల్యే సిద్దారెడ్డికి, విద్యుత్ అధికా రులకు, సర్పంచ్ పంఛరత్నమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి రూ. 40వేలు విరాళం


ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న షేక్‌బాబ్‌జాన్

ధనంబులపూలకుంట, మార్చి 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ధనియాని చెరువు పంఛాయతీలోని సోమరాజు కుంట గ్రామంలో వెలసిన అక్కదేవ తల ఆలయం నిర్మాణానికి బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ మైనార్టీ మోర్చా షేక్ బాబ్‌జాన్ ఆలయ ముఖద్వారానికి రూ.40 వేల రూపా యలు విలువగల గల గ్రిల్స్ కడ్డీలను విరాళంగా సమర్పించడం జరిగింది. అదేవిధంగా బిజెపి మండల అధ్యక్షులు కాసెట్టి రామ్మోహన్ తన వంతు సహాయంగా ఆలయానికి కావల్సిన సిమెంట్ బస్తాలు, ముండ్లవారిపల్లి కె. ఖలీల్ ఆలయ నిర్మాణానికి అవసరమగు 8యంయం ఇనుప కడ్డీలు 150 కెజిలు, బీజేపి కుటుంబ సభ్యులు సిబిఆర్‌చాన్, త్రిబుల్‌ఎస్‌చాను, ఇంతి యా జ్‌కు కూడా తమ వంతు విరాళాలు ఆలయ నిర్మాణానికి ఇవ్వడం జరిగింది.

## ప్రపంచ సాహిత్యంలో రామాయణానికి విశేష స్థానం

### - పుస్తకావిష్కరణ సభలో మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర్‌రెడ్డి


పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

ప్రపంచ సాహిత్యంలో మాన వాళికి మార్గదర్శనం చేసిన విశేష కావ్యాలలో రామాయ ణానికి విశేషస్థానం ఉందని, వర్తమాన సమాజంలో యువత రామాయణ అధ్యయనం చేయాలని మాజీ శాసనసభ్యులు వై. విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర యంలో ఆదివారం నాడు విజయ ఎనగర న్యాయ కళాశాలలో పామిరెడ్డి దామోదరరెడ్డి రాసిన వాల్మీకి రామా యణం-చారిత్రక దృక్కోణం పుస్తక ఆవిష్కరణ సభ ప్రముఖ కవి ఏలూరు యంగన్న అధ్యక్షత వహించారు. గౌరవ అ తిథిగా ఇండియన్ బార్‌కౌన్సిల్ సభ్యులు ఎ.రామిరెడ్డి మాట్లా డుతూ.. రామాయణంలో న్యాయబద్ధమైన జీవితానికి నమూనాగా నిలుస్తుం దన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు డా.కె.ఆనందరావ పుస్తక సమీక్ష చేశారు. ప్రముఖ పద్యగాయకులు పి.వెంకటేశ్వర ప్రసాద్ ఈ సందర్బంగా వేమన పద్యగానం చేస్తారు. వేమన ఫౌండేషన్ కార్యదర్శి డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి సభను సమన్వయం చేశారు. సభ్యులు రవికు మార్, కృష్ణారెడ్డి, నాగేశారెడ్డి, ఆచార్య రమణ, అశ్వర్ధరెడ్డి, కెవి.రమణ, జాహ్నవి, సత్యనారాయణరెడ్డి, సాహిత్యా భిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందాలి - ఎంపిడిఓ నిర్మలాకుమారి


మాట్లాడుతున్న ఎంపిడిఓ నిర్మలాకుమారి

శింగనమల, మార్చి 26 ప్రభాతవార్త

విద్యార్థులందరికీ పౌష్టికాహా రం అందేలా చూడాలని ఎంపి డిఓ నిర్మలా కుమారి పేర్కొన్నా రు. ఆదివారం మండల కేంద్రం లోని అంగన్‌వాడీ 3వ సెం టర్ లో పౌష్టికాహార పక్షోత్స వాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఎంపిడిఓ నిర్మలాకుమారి తహశీల్దారు ఈశ్వ రమ్మ, సిడిపిఓ ఉమా శంకరమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నిర్మలాకు మారిమా ట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలు, ఆకు కూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలిం తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు మునగ ఆకు తీసుకోవడం వల్ల రక్తహీనత లోపాలన్ని తగ్గించు కోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హేమ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్య కర్తలు ప్రమీళ, భారతి, రామాంజి నమ్మ, ఆదిలక్ష్మి, ఆయాలు, గర్భవతులు, బాలిం తలు, కిషోర బాలికలు తదిత రులు పాల్గొన్నారు.

## నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వైస్ ఛాన్స్‌లర్స్ -2023



నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వైస్ ఛాన్స్‌లర్స్-2023కి హాజరైన విసిలు

ఎస్కేయూ, మార్చి 26 ప్రభాతవార్త

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాల యం ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్‌టెక్నాలజీ, మేఘాల యలో అసోషియేషన్ ఆఫ్ ఇండి యన్ యూనివర్సిటీలు న్యూ ఢిల్లీ వారిచే నిర్వహిస్తు న్న 97వ సంవ త్సర జనరల్ బాడీ మీటింగ్ వారిచే నిర్వహిస్తున్న 97వ సంవత్సర జనరల్ బాడీ మీటింగ్ నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వైస్ ఛాన్స్ లర్స్-2023 ఆన్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయర్ ఎడ్యుకేషన్ ఫర్ ఆత్మ నిర్బర్ భారత్‌లో పాల్గొన్నా రు. ఈ సమావేశంలో దేశమంతటా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలలో నెలకొని ఉన్న సమస్యలపై సుదీర్ఘంగాచర్చించారు. ఈ సమావేశంలో ఎస్కే యూ ఉపకులపతి ఎం.రామకృష్ణారెడ్డితో పాటు జెఎన్‌టియు అనంతపురం రంగ జనార్ధన్, రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి తదితరులు పాల్గొన్నారు.

## సాయిట్రస్టుకు మూడు స్ట్రేచర్స్ వితరణ


స్ట్రేచర్స్ వితరణ దృశ్యం

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

సాయిట్రస్టు ఆధ్వర్యంలో 20 సంవత్సరాలుగా ఎంతో మంది నిరాశ్రయులకు, అనాధలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇప్పటి వరకు దాదాపు 1509 మందికి అంతిమ సంస్కా రాలు నిర్వహించడంతోపాటు ఎంతో మంది నిరాశ్రమయులకు వృద్దులను ఆశ్రమాలలో చేర్పించుట, ఎంతో మంది రోగులకు సహాయం అందించడం చేశారు. ఈ సందర్బంగా రఘువీరా టవర్స్‌లోని అనంత సర్జికల్స్‌ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి మంచి గేజ్‌తో ఉన్నటువంటి రెండు స్టీల్ స్ట్రేచర్స్‌ను అనంత సర్జికల్స్ యజమాని సుంకర చంద్రకాంత్‌నాయుడు అందించారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్టు నారాయణనాయక్, రాఘ వేంద్ర, విజయ్‌కిరణ్, ప్రముఖ యూటూబర్ నవీన్ స్మామాట్ పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి హాజరైన కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి


గృహప్రవేశానికి హాజరైన హర్షవర్ధన్‌రెడ్డి

యల్లనూరు, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలోని కోడుమూర్తి గ్రామంలో గుర్రప్ప నూతన గృహప్రవేశానికి ఆదివారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధ న్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఆయనకు ముందుగా వైకాపా నాయ కులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజ ల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో అధ్యక్షులు కిరణ్‌కుమార్, వైకాపా నాయకులు సుబ్బయ్య, గోపాల్‌నాయుడు, జనార్ధన్, పేర్ల నాగేశ్వర్‌రెడ్డి, అన్సర్, తదితరులు పాల్గొన్నారు.

## విందుకు హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


గ్రామస్తులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలోని పెద్దఎక్కలూరు గ్రామంలో వైసిపి నాయకుడు కుమ్మర ఎర్రిస్వామి ఆదివారం ఇచ్చిన విందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్యఅ తిథిగా హాజం య్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైసిపి నాయకులు ఆయనకు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతర ం గ్రామంలోని మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి, జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, రాంబాబు, నాగేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని చౌడేశ్వరి కళ్యాణమండపంలో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్లు మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎంపిపి ఉమాదేవి, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఆసరా 3వ విడత కార్యక్రమ ంలో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని వారు కోరారు.

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్దులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధా శ్రమం లో ఆదివారం లక్ష్మీసాయి, కిరణ్ దంపతుల కుమారుడు బనిత్‌ఆర్యన్ రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. తన మేనల్లుడు ప్రథమ జన్మదినాన్ని పురస్కరించు కుని శేఖర్ మరియు వారి కుటుంబ సభ్యులు వృద్ధుల ద్వారా ఆశీర్వదింపచేశారు. అనంతరం వృద్ధులకు మిఠా యిలు పంపిణీ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు.

## పాఠశాలలకు ఒంటి పూట బడులు వెంటనే ప్రకటించాలి - ఏఐఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 26 ప్రభాతవార్త

ఆల్ ఇండియా అసోషియేషన్ నాయకులు మంజునాథ్ మాట్లాడుతూ.. ఎండలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని, పగటిపూట ఉక్కుపోతతో జనాలు అల్లాడుతున్నారు. పగలుఎండకు తట్టుకోలేక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా ఒంటిపూట బడులు ప్రకటిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. మరి విద్యాశాఖ అధికారులు మామూలుగా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించే వారు కానీ ఈ రోజుకి 26 తారీఖు అయినా కూడా ప్రకటించ లేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండి పడ్డారు. కావున వెంటనే ఒంటిపూట బడులు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

## న్యాయవాదిని బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కదిరి, మార్చి 26 ప్రభాతవార్త

కదిరి కోర్టు పరిధిలోని న్యాయవాధిగా విధులు నిర్వహిస్తున్న డి.సురేంద్ర చౌదరిపై బెదిరింపులకు పాల్పడిన నింధితులపై చర్యలు తీసుకోవాలని కదిరి న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాధులు మాట్లాడుతూ.. న్యాయవాది సురేంద్ర చౌదరికి రక్షణ కల్పించాలంటూ పట్టణ సీఐకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. న్యాయవాదిపై అఖిల భారత న్యాయ పరిరక్షణ సమితినాయకుల నుంచి బెదిరించేలా పోస్టులు చేశారని వీరిపై తక్షణమే చర్యలు తీసుకుని వారిని అరెస్టు చేయాలని న్యాయ వాధులు కోరారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వార్త డైరీని ఆవిష్కరించిన నారా లోకేష్


వార్త డైరీని ఆవిష్కరిస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

కదిరి, మార్చి 26 ప్రభాతవార్త

.తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ వార్త తెలుగు జాతీయ దినపత్రిక 2023- డైరీని ఆవిష్కరించారు. యువగళం పాదయాత్రలో భాగ ంగా 50 రోజులు పూర్తి చేసుకు న్నారు. 50వ రజుఓడిసి మండలంలో ఏర్పాటు చేసిన విడిది కేంద్రంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. వార్త దినపత్రికలో మంచి కథనా లు రాస్తూ తమవంతు సహాయ సహకారాలు వార్త అందిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ.. కథనాలను అందించడంలో వార్త సేవలు మరువలేనివన్నారు. వార్త సంస్థకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తామని భరోసాని ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆర్‌సి ఇన్‌చార్జ్ ఖాజీ సాధిక్‌వలిలు పాల్గొన్నారు.

## వేముల పాడులో వికె కి శ్రద్ధాంజలి ఘటించిన సిపిఐ జిల్లా నేతలు


వేముల పాడులో వికె కి శ్రద్ధాంజలి ఘటిస్తున్న సిపిఐ జిల్లా నేతలు

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

సిపిఐ జిల్లా నాయకులు, ఎంఎ సర్పంచు దివంగత నేత వి.కె.వెంక టరామిరెడ్డికి సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. యాడికి మండలం వేములపాడు గ్రామంలోని వ్యవ సాయ క్షేత్రంలో వికె.వెంకట్రా మిరెడ్డి పార్థివ దేహానికి అంత్యక్రి యలు జరిగిన విషయం తెలిసిందే. అంత్యక్రియలు జరిగిన ప్రాంతంలోనే సిపిఐ జిల్లాకార్యదర్శి సి.జాఫర్, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర వర్కి ంగ్‌ప్రెసిడెంట్ సి.లింగమయ్య, తాడిపత్రి సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి, టి.రంగయ్య, యాడికి సిపిఐ మండల కార్యదర్శి వెంకటేష్, పుట్లూరు సిపిఐ మండల కార్యదర్శి పెదయ్య, రాఘవ, రఫి, తదితరులు శ్రద్ధాంజలి ఘటిం చారు. వికె.వెంక టరామిరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలు వికె విశ్వనాథ్‌రెడ్డి వికె.రంగారెడ్డి, వికె ప్రదీప్‌రెడ్డిని సిపిఐ జిల్లా నేతలు కలుసు కుని తాడిపత్రి ప్రాతంలో రైతులు, కష్టజీవులు, పోర్తికి వికె వెంకటరామిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

## సిపిఐ నాయకులు ఆర్‌ఎన్.మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ జిల్లాకార్యదర్శి జాఫర్


ఆర్‌ఎన్.మల్లారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఐ నేతలు

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

యాడికి మండలం వి.కొట్టాల పల్లి గ్రామంలో సిపిఐ సీనియర్ నా యకులు రాచమల్ల నడిమిటి మ ల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఇందులో భాగంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ఆధ్వర్యంలో సిపిఐ నేతలు ఆదిఆ వరం వి.కొట్టాల పల్లిలోని మల్లారెడ్డి స్వగృహంకి వెళ్లి మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లారెడ్డి కమ్యునిస్టు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నివాళ లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాఫర్‌తోపాటు చేతి వృత్తిదారుల సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్, సి.లింగమయ్య, తాడిపత్రి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి టి.రంగయ్య, యాడికి సిపిఐ మండల కార్యదర్శి వెంకటేష్, పుట్లూరు సిపిఐ మండల కార్యదర్శి పెదయ్య, రాఘవ, రఫిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రత్యేకంగా మల్లారెడ్డితో పార్టీకి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

